జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 8 | జులై | 2026 • పేజీలు : 4



## విద్యార్థిని గరిడేపల్లి భావన కార్తీకను అభినందించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్



**కొత్తగూడెం, జూలై 7, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా హేమచంద్రాపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గరిడేపల్లి రవికుమార్ కుమార్తె గరిడేపల్లి భావన కార్తీకను

మిగతా 2 లో...

## సింగరేణిలో కారుణ్య నియామకాలు ఎప్పుడో..!

- 17 నెలలుగా ఎదురు చూపులు..
- 15వ మెడికల్ బోర్డుకు మోక్షం దక్కేనా..?
- గతంలో దరఖాస్తు చేసుకున్న కార్మిక కుటుంబాల్లో పెరుగు తున్న ఆందోళన
- కారుణ్య నియామ కాల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో నన్న ఉత్కంఠ
- 15వ మెడికల్ బోర్డు పెండింగ్‌తో నిలిచి పోయిన ఆశలు
- కాలయాపన చేయ కుండా ప్రక్రియను పునరుద్ధరించాలని కార్మి, కుల విజ్ఞప్తి

**ఉపాధి కోసం కుటుంబ సభ్యుల నిరీక్షణ**

**ఇల్లందు, జులై 7 (ప్రజా జ్యోతి)** సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్న కార్మిక కుటుంబాల ఆశలు రోజురోజుకూ పొడుగవుతున్నాయి. విధి నిర్వహణలో ఉన్న సమయంలో అనారోగ్యానికి గురైన లేదా మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించబడిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉపాధి కల్పించే ప్రక్రియ చాలా కాలంగా నిలిచిపోవడంతో వందలాది కుటుంబాలు

మిగతా 2 లో...



4 లో..

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర...

## సింగరేణికి తాడిచెర్ల-2 వరం

- కేంద్రం తుది ఆమోదంతో కీలక బొగ్గు గని
- సంస్థకు రూ.2,550 కోట్ల ఆర్థిక ప్రయోజనం...
- 40-50 ఏళ్ల బొగ్గు ఉత్పత్తికి భరోసా...
- బలరాం హయాంలో కదిలిన ఫైలు...
- భట్టి విక్రమార్క అనుసరణ... కిషన్ రెడ్డి సంతకంతో ముగిసిన దశాబ్దకాల పోరాటం

దాదాపు 13 ఏళ్లుగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఫైళ్లలో తిరుగుతూ వచ్చిన తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ వ్యవహారానికి ఎట్టకేలకు తెరపడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఈ కీలక బొగ్గు గనిని ఎలాంటి వేలం నిర్వహించకుండా నేరుగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. జులై 7న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ ఫైలుపై సంతకం చేయడంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రక్రియ పూర్తయింది. దీంతో సింగరేణికి సుమారు రూ.2,550 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరడమే కాకుండా, రాబోయే 40 నుంచి 50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తికి భరోసా లభించనుంది.

• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# ప్రమాదపు అంచున
## గణేష్ పాడు ప్రభుత్వ పాఠశాల

- శిథిలమైన ప్రహరీ గోడతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు..
- ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు




**దమ్మపేట, జూలై 7(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం గణేష్ పాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ప్రహరీ గోడ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం ఓ కాంట్రాక్టర్ భారీ డంపర్‌తో తీసుకొచ్చిన కంకరను పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని పోయడంతో ఇప్పటికే బలహీనంగా ఉన్న గోడ మరింత దెబ్బతిని కొంత భాగం కూలిపోయింది. మిగిలిన గోడ కూడా ప్రమాదకర స్థితిలో ఉండటంతో చిన్నారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు

మిగతా 2 లో...

## అశ్వారావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు–ట్రాక్టర్ ముఖాముఖి ఢీ..
- 12 మందికి గాయాలు, డ్రైవర్ పరిస్థితి విషమం



2 లో...

# సింగరేణిలో కారుణ్య నియామకాలు ఎప్పుడో..!

(మొదటి పేజీ తరువాయి...)

తీవ్ర నిరాశకు గురవుతున్నాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేక ఎదురుచూస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

### 15వ మెడికల్ బోర్డుపై ఆశలు!

సింగరేణిలో కారుణ్య నియామకాల ప్రక్రియలో కీలకమైన 15వ మెడికల్ బోర్డు నిర్వహణపై ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. మెడికల్ బోర్డు పూర్తయితేనే తదుపరి నియామక ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉండటంతో అందరి చూపు యాజమాన్య నిర్ణయంపైనే ఉంది.

### 17 నెలలుగా నిరీక్షణ..!!

సింగరేణి సంస్థలో సుమారు 17 నెలలుగా ఈ ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, ఉద్యోగ అవకాశాల కోసం ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నామని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కుటుంబాలపై ఆర్థిక భారం?

కారుణ్య నియామకాలపై ఆధారపడిన కుటుంబాలు ప్రస్తుతం ఆర్థికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఉద్యోగం వస్తుందనే ఆశతో ఇతర అవకాశాలను కూడా వదులుకున్న కొందరు అభ్యర్థులు భవిష్యత్తుపై అనిశ్చితిలో ఉన్నట్లు పేర్కొంటున్నారు. ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని అంటున్నారు.

### త్వరిత నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి!

సింగరేణి సంస్థలో దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల ప్రక్రియను వెంటనే పునరుద్ధరించి, 15వ మెడికల్ బోర్డును నిర్వహించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కార్మికులు, కార్మిక కుటుంబాలు, కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాలయాపన చేయకుండా స్పష్టమైన షెడ్యూల్ ప్రకటిస్తే ఎన్నో కుటుంబాలకు ఊరట లభిస్తుందని కార్మికులు, కార్మిక కుటుంబాలు అభిప్రాయపడుతున్నాయి.

# ప్రమాదపు అంచున గణేష్ పాడు ప్రభుత్వ పాఠశాల





(మొదటి పేజీ తరువాయి...)

చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. విరామ సమయంలో, ఆటల సమయంలో పిల్లలు ప్రహరీ గోడ సమీపంలో తిరిగే అవకాశం ఉండటంతో ఏ క్షణమైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయులు పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. పాఠశాల ప్రారంభమై నెల రోజులు గడిచినా ప్రహరీ గోడ మరమ్మతులకు నోచుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా సంబంధిత విద్యాశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదకర స్థితిలో ఉన్న ప్రహరీ గోడను తొలగించి, కొత్త గోడ నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు చర్యలు తీసుకుని చిన్నారుల ప్రాణాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

### కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

**కొత్తగూడెం టౌన్, జులై 7 ( ప్రజా జ్యోతి )** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రతి అర్హుడూ ఓటు హక్కు పొందడంతో పాటు దానిని కాపాడుకోవడం కూడా బాధ్యతగా భావించాలని ఆమె అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్‌లో కొనసాగుతున్న ఓటరు సవరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. 177వ పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను స్వయంగా నింపుతూ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారి రాధిక, బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు ఖాజా భక్ష్, వాసుకి, సుందర్ పాషాలతో కలిసి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అనర్హుల పేర్లు ఓటరు జాబితాలో లేకుండా క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఓటరు నమోదు, సవరణ ఫారాలు నింపడంలో అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కాపు సీతాలక్ష్మి కోరారు.



# మాలల మహా ర్యాలీ, సభను విజయవంతం చేయాలి

### మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ పిలుపు



**కొత్తగూడెం టౌన్, జులై 7 ( ప్రజాజ్యోతి )** ఈ నెల 12వ తేదీ ఆదివారం భద్రాచలంలో నిర్వహించనున్న మాలల మహా ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ పిలుపునిచ్చారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మాలల మహా ర్యాలీ, సభకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎర్రమళ్ల రాములు నాయకత్వంలో జిల్లా జనరల్ సెక్రటరీ అల్లాడి పాల్‌రాజ్, జిల్లా ఇన్‌చార్జి దామల సత్యం ఆధ్వర్యంలో ఈ నెల 12న భద్రాచలంలో నిర్వహించే మహా ర్యాలీ, సభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలని రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో మాల సంఘాల నాయకులు, యువత, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ నాయకులు ఏ.వి. రావు, బైరి రవికుమార్, బండి పవన్‌కుమార్, సల్వాది హృదయ, శ్రీనివాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని గరిడేపల్లి భావన కార్తీకను అభినందించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్

(మొదటి పేజీ తరువాయి...)

ప్రత్యేకంగా అభినందించారు. పాల్వంచలోని శ్రీ విద్యా స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న భావన కార్తీక, తెలంగాణ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ఇండోర్ రైఫిల్ షూటింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతోంది. గత ఏడాది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఆమె, ఈ ఏడాది తెలంగాణ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పిస్టల్ విభాగంలో ప్రతిభ కనబర్చి సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ ఆమెను అభినందిస్తూ, సౌత్ జోన్ పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐజీ చంద్రశేఖర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొని భావన కార్తీకను అభినందించారు.

# అశ్వారావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

**అశ్వారావుపేట, జులై 7(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని వ్యవసాయ కళాశాల సమీపంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మొత్తం 12 మంది గాయపడగా, ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. , ట్రాక్టర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురు క్షతగాత్రులకు అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మిగిలిన గాయపడిన వారికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ప్రయాణికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం లేదా ఇతర కారణాలతో ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# విద్యార్థులు విజ్ఞాన పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

### విజ్ఞాన పరీక్ష కరపత్రాన్ని ఆవిష్కరించిన మండల విద్యాశాఖాధికారి ఆనంద్ కుమార్



**అన్నపురెడ్డిపల్లి, జులై 7 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విజ్ఞాన పరీక్ష కరపత్రం, గోడ పత్రికలను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశం వేదకాలం నుంచే ప్రపంచానికి ఎన్నో శాస్త్రీయ ఆవిష్కరణలను అందించిందని తెలిపారు. కనాద మహర్షి నుంచి భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం వరకు కొనసాగిన భారతీయ విజ్ఞాన పరంపర నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భారతీయ శాస్త్రీయ వారసత్వాన్ని భావితరాలకు చేరవేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న విద్యార్థుల విజ్ఞాన పరీక్షలకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థుల్లో భారతీయ విజ్ఞాన సంపదపై అవగాహన పెంపొందించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, జాతీయ భావనలను అభివృద్ధి చేయడమే ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశమని వివరించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ప్రముఖ శాస్త్ర–సాంకేతిక సంస్థలను సందర్శించే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు అధిక సంఖ్యలో విద్యార్థులను ఈ పరీక్షలకు నమోదు చేసి భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులు, తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్, సునంద రెడ్డి, శాంత కుమారి, రాజ్యలక్ష్మి , బాబురావు, వెంకటేశ్వరరావు, బాలు, వసంత, సుశీల, పద్మ, మోతీలాల్, జయరాం, ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# గుప్పెడు గింజలతో పచ్చని భవిష్యత్తు

- అంకంపాలెం పాఠశాల విద్యార్థులతో 5 వేల సీడ్ బాల్స్ తయారీ





**దమ్మపేట, జూలై 7(ప్రజా జ్యోతి ):** దమ్మపేట మండలంలోని అంకం పాలెం ఆశ్రమ పాఠశాలలో గుప్పెడు గింజల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 5 వేల సీడ్ బాల్స్ తయారు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి చందన, దమ్మపేట ఏటిడీఓ శ్రీ చంద్ర మోహన్ పాల్గొని విద్యార్థులను అభినందించారు. డీడీ, పీఓల ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మట్టి, సేంద్రియ ఎరువు, వివిధ రకాల విత్తనాలతో గుప్పెడు గింజలను తయారు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తయారు చేసిన సీడ్ బాల్స్‌ను వర్షాకాలంలో ఖాళీ ప్రదేశాలు, అటవీ ప్రాంతాల అంచులు, రహదారుల వెంట చల్లడం ద్వారా మొక్కల పెరుగుదలకు దోహద పడుతుందని తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అధికారులు పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించాలనే సంకల్పంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 5 వేల గుప్పెడు గింజలను తయారు చేయడం అభినందనీయమని కొనియాడారు.

## పార్టీకి వార్డు కమిటీలే కీలకం



**ఇల్లందు, జులై 7 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు వార్డు కమిటీలే కీలకమని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యం లు అన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో కౌన్సిలర్ గోపగాని రాజు గౌడ్ ఆధ్వర్యంలో వార్డు కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు వార్డ్ కమిటీలు కృషి చేయాలని సూచించారు. వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వారి వద్దకు వెళ్లి నిరంతరం అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం వార్డు అధ్యక్షుడిగా సలేంద్ర వెంకన్న, ఉపాధ్యక్షుడిగా కంటే రాజు, ప్రధాన కార్యదర్శిగా కాటిక శ్రీనివాస్, కార్యదర్శిగా కావేటి సుమన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రేఖ ప్రసాద్, కోశాధికారిగా సోహబ్, కార్యవర్గ సభ్యులుగా జడల బలరాం, ఖదీర్, బొల్లం సత్యం, ఆకుల సాంబ, చిలుక సైదులు, యండి నదీమ్, ఉపేంద్ర చారి, వాసం రాజేష్, యాసీన్, మహిళ కమిటీ అధ్యక్షురాలిగా జడల కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా గోపగాని వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సలేంద్ర లక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వాసం సరోజ, కోశాధికారిగా రేఖ కుమారి, కార్యవర్గ సభ్యులుగా బొల్లం రేణుక, బానోత్ ఝాన్సీ, జడల విజయలక్ష్మి, చంద్రకళ, ఆకుల రమణ, ఉప్పునూతుల రమాదేవి, కొప్పుల జయ, కిరణ్ కుమారి సాహు, ఆఫ్రాన్, కాటిక స్వరూప రాణి, పావని, అనసూర్య, బెనబి, హతిజాబీ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి, కోఆప్షన్స్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, హసీనా, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మారగాని శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, మహిళా కమిటీ సభ్యులు మడుగు వెంకటలక్ష్మి, రాజూరి మంజుల, శ్వేత, వరలక్ష్మి, చెంచమ్మ, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, నాయకులు గందే సదానందం, వెంకటనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంజారా వస్త్రధారణలో చిన్నారులు ఆకట్టుకున్న సీత్ల పండుగ వేడుకలు

- గ్రామాల్లో ఘనంగా సీత్ల (దాటుడు) పండుగ నిర్వహణ
- భక్తిశ్రద్ధలతో ఆరాధ్య దేవతలకు ప్రత్యేక పూజలు చేసిన గిరిజనులు





**టేకులపల్లి,జూలై 07,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని పలు గిరిజన తండాల్లో మంగళవారం సీత్ల (దాటుడు) పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో జరుపుకునే ఈ పండుగ గిరిజన లంబాడీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది.ఉదయం నుంచే మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ బంజారా వస్త్రధారణలో డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ తండాల సమీపంలోని ఆరాధ్య దేవతల గద్దెల వద్దకు చేరుకున్నారు. అక్కడ దేవతామూర్తులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంతో తయారు చేసిన నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నా రు.గ్రామాలు సుభిక్షంగా ఉండాలని,సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పశువులు క్షేమంగా ఉండాలని, పిల్లలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవతలను వేడుకున్నారు. అనంతరం బలిహరణ నిర్వహించి, దాని మీదుగా పశువులను దాటించడం ఈ పండుగలో ప్రత్యేక ఆచారంగా నిర్వహించారు. గిరిజన నాయకులు మాట్లాడుతూ సీత్ల (దాటుడు) పండుగ ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న గిరిజన లంబాడీల సంస్కృతి, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు.పండుగ అనంతరం గ్రామస్తులు సామూహిక వనభోజనాలు నిర్వహించి ఆనందోత్సాహాలతో వేడుకలను ముగించారు.ఈ కార్యక్రమంలో ఆయా తండాల గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తడికలపూడిలో కాంగ్రెస్ గ్రామ శాఖ కమిటీ ఎన్నికలు



**టేకులపల్లి, జూలై 07,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం తడికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీ ఎన్నికలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇల్లందు నియోజక వర్గంకాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కోరం సురేందర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో గ్రామ శాఖ అధ్యక్షుడిగా జజ్జర రామనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వాసం అనిల్, గుగులోత్ రవి ఎన్నిక కాగా, కార్యదర్శులు, కమిటీ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకుడు ఈది గణేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల



**బూర్గంపహాడ్, జూలై 7, (ప్రజా జ్యోతి ):** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027 – 28 విద్యాసంవత్సరం 6వ తరగతి ప్రవేశాలకై నోటిఫికేషన్ విడుదలైందని బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాకలో గల బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి ఎన్ ఆర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష వ్రాయుటకు ఈనెల 31వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. కాగా నవంబర్ 28 న ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందని తెలియజేశారు. ఈ సదవకాశాన్ని ఐదవ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు సద్వినియో గం చేసుకోగలరని డా.బిఎన్ఆర్ కోరారు.పూర్తి వివరాలకై బ్రిలియంట్ నవోదయ కోచింగ్ సెంటర్ సారపాక,సెల్ 9866283566, 8142652005 సంప్రదించవచ్చని తెలిపారు.

## ఘనంగా పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు




**టేకులపల్లి, జూలై 07,ప్రజాజ్యోతి:** పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను టేకులపల్లి రామాలయం వీధి ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి,ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు ములకపల్లి రవి, చాపలమడుగు వెంకటేశ్వర్లు, మెంతినీ ప్రభాకర్, జినకా ఇస్తరీ ముఖ్య అతిథులుగా హాజరై మంద కృష్ణమాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని కొనియాడారు.మండల నాయకుడు పోలిపొంగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పోలిపొంగు లక్ష్మణ్, శ్రీను, వెంకన్న, రాములు, సత్యం, బాబు, ముత్తయ్య, పవన్ కళ్యాణ్, విక్రమ్, గుగ్గిళ్ల లక్ష్మయ్య, బండారి శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం స్వీట్లు పంచి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.



# 13 ఏళ్ల నిరీక్షణకు తెర...

## సింగరేణికి తాడిచెర్ల-2 వరం

- కేంద్రం తుది ఆమోదంతో కీలక బొగ్గు గని
- సంస్థకు రూ.2,550 కోట్ల ఆర్థిక ప్రయోజనం...
- 40-50 ఏళ్ల బొగ్గు ఉత్పత్తికి భరోసా...
- బలరాం హయాంలో కదిలిన ఫైలు...
- భట్టి విక్రమార్క అనుసరణ... కిషన్ రెడ్డి సంతకంతో ముగిసిన దశాబ్దకాల పోరాటం

**దాదాపు 13 ఏళ్లుగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఫైళ్లలో తిరుగుతూ వచ్చిన తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ వ్యవహారానికి ఎట్టకేలకు తెరపడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఈ కీలక బొగ్గు గనిని ఎలాంటి వేలం నిర్వహించకుండా నేరుగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. జూలై 7న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ ఫైలుపై సంతకం చేయడంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రక్రియ పూర్తయింది. దీంతో సింగరేణికి సుమారు రూ.2,550 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరడమే కాకుండా, రాబోయే 40 నుంచి 50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తికి భరోసా లభించనుంది.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో చర్చిస్తున్న అప్పటి సింగరేణి సీఎండీ ఎన్. బలరాం.



తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ కేటాయింపు నిర్ణయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.

### 1995లో గుర్తింపు... 2013లో కేటాయింపు...

తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను తొలిసారిగా 1995లో గుర్తించారు. అనంతరం 2013 సెప్టెంబర్ 16న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించింది. అయితే కేటాయింపు జరిగినప్పటికీ మైనింగ్ లీజు, అటవీ అనుమతులు, కేంద్ర ముందస్తు ఆమోదం, ఇతర సాంకేతిక ప్రక్రియలు పూర్తికాక గని ఉత్పత్తి దశకు చేరుకోలేదు. దీంతో ఈ ప్రాజెక్టు దాదాపు 13 ఏళ్లపాటు పరిపాలనా ప్రక్రియలకే పరిమితమైంది. అయితే ఈ కాలంలో సింగరేణి తన ప్రయత్నాలను ఎక్కడా ఆపలేదు. 2014లో రీకానైసెన్స్ సర్వే నిర్వహించింది. అనంతరం జియోలాజికల్ మోడల్ రూపొందించింది. 2015లో ఫీజిబిలిటీ నివేదిక సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ మైనింగ్ ప్లాన్ తయారు చేసింది. అటవీ విస్తీర్ణం అధికంగా ఉండటంతో మొత్తం బ్లాక్‌ను పార్ట్-1 (6.08 చ.కి.మీ.), పార్ట్-2 (12.67 చ.కి.మీ.)గా విభజించింది. పార్ట్-1లో రూ.22.16 కోట్లతో డీటైల్డ్ ఎక్స్‌ప్లోరేషన్ పూర్తి చేసింది. 2021 నవంబర్ 1న ఫారెస్ట్ ల్యాండ్ ఆథెంటికేషన్ పూర్తికాగా, 2024 మే 23న పార్ట్-2లో 91 బోర్‌హోల్స్ తవ్వేందుకు అవసరమైన స్టేజ్-2 అటవీ అనుమతిని కూడా దక్కించుకుంది.

### అసలు అడ్డంకి... కేంద్ర ముందస్తు అనుమతే

అన్ని సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం 2021 నవంబర్ 15న మైనింగ్ లీజు ప్రతిపాదనను కేంద్రానికి పంపింది. 2024 జనవరి 2న కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు వివరాలు కోరగా, కేవలం నాలుగు రోజుల్లోనే సింగరేణి పూర్తి సమాచారాన్ని సమర్పించింది. అనంతరం 2024 ఫిబ్రవరి 21న మరోసారి ముందస్తు అనుమతి (ప్రయర్ అప్రూవల్) ఇవ్వాలని కోరింది. అయినప్పటికీ కేంద్రం నుంచి తుది అనుమతి ఆలస్యమవడంతో మైనింగ్ లీజు జారీ కాలేదు. ఇదే ఈ ప్రాజెక్టు దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉండడానికి ప్రధాన కారణమైంది.

### బలరాం హయాంలో కదిలిన ఫైలు...

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్. బలరాం సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తాడిచెర్ల-2 ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకున్నారు. భవిష్యత్తులో సింగరేణి ఉత్పత్తిని నిలబెట్టేది కొత్త బొగ్గు గనులేననే దృక్పథంతో ఈ ఫైలును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖతో వరుస సమీక్షలు నిర్వహించడంతో పాటు తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం పెంచారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై నిరంతర అనుసరణ చేపట్టారు. ఇప్పటికే జరిగిన అన్వేషణ, సాంకేతిక అధ్యయనాలు, మైనింగ్ సామర్థ్యం, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరిస్తూ సమగ్ర నివేదికలను కేంద్రానికి పంపించారు. అతని రెండేళ్ల పదవీకాలం అనంతరం ఇతర బాధ్యతలకు వెళ్లిపోయినప్పటికీ, ఆయన హయాంలోనే తాడిచెర్ల-2 ఫైలు నిర్ణయాత్మక దశకు చేరినట్లు సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి.

### భట్టి విక్రమార్క అనుసరణ... ఢిల్లీలో వరుస ప్రయత్నాలు...

ఇక సింగరేణి విజ్ఞప్తులకు తెలంగాణ ప్రభుత్వం కూడా బలమైన మద్దతు ఇచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 2024 మార్చి 7, జూన్ 21 తేదీల్లో కేంద్ర బొగ్గు శాఖను నేరుగా సంప్రదించారు. తాడిచెర్ల-2కు వెంటనే ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరారు. తెలంగాణ విద్యుత్ అవసరాలు, సింగరేణి భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను వివరిస్తూ కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేశారు. ఈ అనుసరణ ఫలితంగా దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫైలుపై జూలై 7న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సంతకం చేశారు. దీంతో ఎలాంటి వేలం లేకుండానే తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపింది. ఫలితంగా సంస్థకు రూ.2,550 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరనుండగా, మరో కీలక బొగ్గు గని కూడా దక్కింది.

### సింగరేణికి కొత్త ఊపిరి...

తాడిచెర్ల-2 గనిలో మైనింగ్ ప్రారంభమైతే రాబోయే 40 నుంచి 50 సంవత్సరాల పాటు సింగరేణికి బొగ్గు ఉత్పత్తిపై భరోసా లభించనుంది. ప్రస్తుతం పలు పాత గనుల్లో నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ఈ బ్లాక్ సంస్థ భవిష్యత్తును నిలబెట్టే కీలక గనిగా మారనుంది. తెలంగాణలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు దీర్ఘకాలిక బొగ్గు సరఫరా అందించడంతో పాటు సంస్థ ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది. వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా లభించనున్నాయి. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ కేటాయింపు ఒక సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు. 1995లో గుర్తింపుతో ప్రారంభమైన ఈ ప్రయాణం... 2013లో సింగరేణికి కేటాయింపు... అనంతరం సాంకేతిక అధ్యయనాలు, అన్వేషణ, అటవీ అనుమతులు, మైనింగ్ లీజు ప్రక్రియ, కేంద్ర ముందస్తు ఆమోదం... ఇలా దాదాపు 13 ఏళ్లపాటు కొనసాగింది. ఈ మధ్య కాలంలో సింగరేణి రూ.22.16 కోట్లతో అన్వేషణ పనులు పూర్తి చేసింది. తెలంగాణ ప్రభుత్వం వరుసగా కేంద్రాన్ని కోరింది. మాజీ సీఎండీ ఎన్. బలరాం హయాంలో ఈ ఫైలుకు వేగం వచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో నిరంతర అనుసరణ కొనసాగించారు. చివరకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆమోద ముద్రతో ఈ సుదీర్ఘ ప్రక్రియ ముగిసింది.



